

పొదుపు సంఘాల మహిళల్ని వ్యాపారవేత్తలుగా చేస్తామని, వారి జీవితాల్లో అనూహ్యమైన మార్పులు తీసుకొస్తామని చెప్పిన గత ప్రభుత్వం వారి డబ్బులతోనే మహిళా మార్టులను ఆర్భాటంగా ప్రారంభించి వదిలేసింది. మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తామంది. జిల్లాలో రెండు చోట్ల మాత్రమే ప్రారంభించింది. నిర్వహణలో ఎదురయ్యే సాదకబాధకాలను పట్టించుకోలేదు. నష్టాలు వస్తే వాటి నుంచి బయటపడే మార్గాన్ని నిర్దేశించలేదు. కనీసం వారికి వ్యాపార మెలకువలను నేర్పలేదు. చివరకు వ్యాపారం సాగక, కనీస స్థాయిలో కొనుగోళ్లు లేక.. సరుకులు పాడై నష్టాల బాట పట్టాయి. వాటిని నిర్వహించలేక వెలుగు సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

- తిరోగమనంలో మహిళా మార్టులు
- మధ్యలోనే ఆగిపోయిన ఆన్‌లైన్ డిజిటల్ కామర్స్
- ఆర్భాటంగా ప్రారంభించిన గత ప్రభుత్వం
- నిర్వహణలో లోపాలు సరిచేయని వైనం
- నష్టాలు భరించలేక తలలు పట్టుకుంటున్న వెలుగు సిబ్బంది

మార్పుతేని మార్టులు



గరివిడిలో ఏర్పాటు చేసిన మహిళా మార్టు



చీపురుపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలానికొక మహిళా మార్టును నెలకొల్పుతామన్నారు. కానీ జిల్లాలో రెండుచోట్ల ఎస్.కోట, గరివిడిలో మాత్రమే ఏర్పాటు చేశారు. ఇందుకోసం అధికారులు పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఒక్కో మహిళ నుంచి రూ.300 వంతున వసూలు చేశారు. ఈ లెక్కన జిల్లాలోని 27 మండలాల నుంచి సుమారు రూ.13.39 కోట్లు వసూలైనట్టు సమాచారం. ఈ మొత్తంతో ప్రతి మండలంలో మార్టులు నెలకొల్పాల్సి ఉంది. కానీ రెండుచోట్లే ప్రారంభించారు. క్లస్టర్ సమన్వయకర్తల్ని ఆ మార్టులకు ఇన్‌చార్జిలుగా నియమించారు. ఆయా పరిసర ప్రాంతాల్లో ఉన్న డ్వాక్రా మహిళలు, వారికి పరిచయమున్న కుటుంబాలు తమకు అవసరమైన నిత్యావసర సరుకుల్ని సమీపంలో ఉన్న మహిళా మార్టుల్లో కొనుగోలు చేయాలని అందరికీ జిల్లా స్థాయి అధికారులు వర్తమానాలు పంపించారు. అయితే అందుబాటులో ఉన్న దుకాణాలను వదిలేసి, దూరంలో ఉన్న ఈ మార్టులకు ఆటోల్లోనో, ఇతర వాహనాల్లోనో వెళ్లి సరుకులు తెచ్చుకోవడం కష్టంతో కూడుకున్న పని కావడంతో ఎవరూ ఆసక్తి చూపలేదు. అధికారులు ఊహించిన మేర వ్యాపారం జరగకపోవడంతో చివరి ప్రయత్నంగా మహిళల్ని ఒత్తిడి చేసి, బలవంతంగా కొనుగోలు చేయించారు. మండలాల్లో సేవలందిస్తున్న వీఓఏలకు కూడా సరుకుల కొనుగోలులో లక్ష్యాలను విధించారు. వారు ఏదో విధంగా మార్కెటింగ్ చేయకతప్ప లేదు. ఈ రకంగా మార్టుల్లో కొంత మేర వ్యాపారాలు నడిచాయి. అయితే దుకాణాలకు అద్దె చెల్లించాల్సి రావడంతో పాటు నిర్ణీత గడువు ముగిసి ముగిగిపోయిన సరుకులు అధికంగా పేరుకుపోవడంతో వ్యాపారానికి భారంగా పరిణమించాయి.

● మార్టులు నడవడం కష్టంగా మారిన పరిస్థితుల్లోనే అధికారులు ఆన్‌లైన్ వ్యాపారానికి కూడా తెర తీశారు. సరుకులు (మిగతా 6వ పేజీలో..)

ఆర్థిక భారంతోనే..

పప్పు దినుసులు, ఆయిల్స్ ఇతర నిత్యావసరాలపై సరుకుల ధరలతో పాటు రవాణా చార్జీల భారాన్ని మోపుతుండడంతో వినియోగదారులు ఆసక్తి చూపలేదు. కిలో పంచదార బహిరంగ మార్కెట్లో యాభై రూపాయలు ఉండగా రవాణా వ్యయం కలిపి వినియోగదారుడి నుంచి ఇక్కడ అదనంగా వసూలు చేశారు. ఇటువంటి కారణాల వల్ల వెలుగు ద్వారా నడిపిస్తున్న ఈ మార్టులు తిరోగమనంలో పడ్డాయి.

అవగాహన పెరగాల్సి ఉంది

మహిళలందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న మార్టులవి. వీటిలో వ్యాపారం జరిగితే డ్వాక్రా మహిళలే ప్రయోజనం పొందుతారు. అందుకే ఆ మార్టుల్లో కొనుగోలు చేయాలని చెబుతున్నాం. ఈ విషయంలో మహిళలకు మరింత అవగాహన కల్పించాల్సి ఉంది. కొనుగోలుకు ఎవరినీ ఒత్తిడి చేయలేదు. చీపురుపల్లి, ఎస్.కోట మార్టులు విజయవంతమైతే మరిన్ని నెలకొల్పుతాం. ఓఎన్‌డీసీ కూడా తాత్కాలికంగా ఆపేశాం. రవాణాలో ఇబ్బందులు వాస్తవమే.

- కోరాడ సావిత్రి, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, విజయనగరం.

మత్స్యకారులకు మంచి రోజులే

- వేట నిషేధ సమయంలో పరిహారం రెట్టింపు
- రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంపు
- గంగపుత్రుల్లో ఆనందోత్సాహాలు
- నేడు ఎచ్చెర్ల నియోజకవర్గానికి సీఎం రాక
- మత్స్యకారులకు భృతి పంపిణీ 4లో



అర్హులందరికీ స్పౌజ్ పింఛన్లు


మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్‌లకు సంబంధించి అర్హులందరికీ స్పౌజ్ పింఛన్లు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. వచ్చే నెల ఒకటి నుంచి వీటిని అందజేస్తామన్నారు. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజుతో కలసి టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. స్పౌజ్ పెన్షన్ల కోసం గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో అర్హులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 30 వేల పెన్షన్‌లు తొలి విడతగా స్పౌజ్ కోటా కింద ఇచ్చామని చెప్పారు. మరో 90 వేల పెన్షన్‌లు మే ఒకటి నుంచి ఇవ్వనున్నట్టు తెలిపారు. తద్వారా ప్రభుత్వంపై అదనంగా జిల్లాలో రూ.35 కోట్ల మేర భారం పడనుందన్నారు. అయినా స్పౌజ్ కోటా కింద (భర్త చనిపోయిన వెంటనే భార్య) పెన్షన్లు ఇస్తామన్నారు. అర్హులంతా ఈ నెల 30న ధ్రువీకరణ పత్రాలను అధికారులకు ఇవ్వాలని చెప్పారు.

● రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల పరిధిలో మే నెలలో 50 ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభిస్తామని మంత్రి శ్రీనివాస్ చెప్పారు.


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్, పక్కన ఎమ్మెల్యే అదితి

● రాజాం నియోజకవర్గంలో ఓ గ్రామానికి చెందిన బాలికకు కుటుంబ సభ్యులు ఇటీవల వివాహం జరిపించేందుకు సిద్ధపడ్డారు. మేనల్లుడు అమెరికాలో ఉన్నాడని, మంచి సంబంధం మళ్లీ రాదని నిర్ణయించుకుని కూతురును కట్టబెట్టాలనుకున్నారు. సమాచారం అందుకున్న చైల్డ్‌లైన్ సిబ్బంది గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించడంతో వారు పెళ్లిని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు.



● చీపురుపల్లి నియోజకవర్గంలో ఓ బాలికను సమీప బంధువుతో వివాహం జరిపించేందుకు కుటుంబసభ్యులు నిర్ణయించుకున్నారు. ఆమె వయసు 16 ఏళ్లు మాత్రమే. అయినప్పటికీ వరుడి కుటుంబం ఆర్థికంగా బలంగా ఉందని, సొంత మనిషి అని పెళ్లికి ఆసక్తి చూపారు. ఈ విషయం తెలుసుకున్న చైల్డ్‌లైన్ సిబ్బంది గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో వివాహాన్ని వాయిదా వేసుకున్నారు.

బాల్యానికి బంధనాలు

- జిల్లాలో పెరుగుతున్న బాల్య వివాహాలు
- అవగాహన లేక జరిపిస్తున్న తల్లిదండ్రులు
- తల్లీ పిల్లలకు తప్పని అనారోగ్య సమస్యలు
- కొన్నింటిని అడ్డుకుంటున్న చైల్డ్‌లైన్

రాజాం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వివాహ జీవితంలో అడుగు పెట్టేవారు ముందు మానసికంగా సిద్ధం కావాలి. పెళ్లి అంటే నూరేళ్ల బంధమని తెలుసుకోవాలి. పుట్టింట్లో నుంచి మెట్టింట్లో అడుగు పెట్టేటప్పుడు ఎదురయ్యే సవాళ్లను వారు సానుకూలంగా తీసుకుని అనుకూలంగా మార్చుకోగలగాలి. అందుకు వయసు కూడా కీలకం. అయితే దగ్గర బంధువు అని.. ఆర్థికంగా బలంగా ఉన్న కుటుంబం అని.. మేనల్లుడు అని.. మంచి సంబంధాలు రావేమోనని ముందే బాలికలను పెళ్లి పీటలు ఎక్కించేస్తున్నారు. భవిష్యత్‌లో జరిగే పరిణామాలను ఆలోచించకుండా బలవంతంగా పెళ్లి చేసేస్తున్నారు. ఈ విధంగా జిల్లాలో బాల్య వివాహాలు గుట్టుగా జరిగిపోతున్నాయి. ఆ తర్వాత కొద్ది నెలలకే వారు అనారోగ్యానికి గురవుతున్నారు. రక్తహీనత, ఇతర రుగ్మతలతో బాధ పడుతున్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిసినా తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. పది, ఇంటర్ విద్యార్థినులను పెళ్లిపీటలు ఎక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. కాగా సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, ఘటనలు చూస్తున్న కొందరు తల్లిదండ్రులు మానసికంగా బలహీనమై ఆడపిల్లలకు వివాహం జరిపిస్తే మేలన్న నిర్ణయానికి వస్తున్నారు. పిల్లలను బలంగా తయారు చేయకుండా తాము లేనిపోని అపోహలతో వారి జీవితాన్ని నాశనం చేస్తున్నారు.

● కొన్ని బాల్య వివాహాలను మాత్రమే అధికారులు అడ్డుకోగలుగుతున్నారు. 2024లో 95 వివాహాలను అడ్డుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2023లో 88, 2022లో 50, 2021లో 24, 2020లో 32 బాల్య వివాహాలను కట్టడి చేశారు. అయితే అంతకుమించి వివాహాలు జిల్లా వ్యాప్తంగా జరిగినట్టు తెలుస్తోంది. ప్రతి నెలా విజయనగరం (మిగతా 6వ పేజీలో..)

నియంత్రిస్తున్నాం

జిల్లాలో బాల్య వివాహాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాం. వాటి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. పోలీసులు, ఐసీడీఎస్, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాయి. ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండకపోతే వారి పిల్లల భవిష్యత్‌కే ముప్పు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. ఇదో సామాజిక బాధ్యతగా చూడాలి.

- శాంతికుమారి, ఐసీడీఎస్ పీడీ, విజయనగరం



అనర్థాలే అధికం

బాల్య వివాహాలతో అనర్థాలే అధికం. సంతానోత్పత్తి సమయంలో చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. పుట్టిన పిల్లలతో పాటు తల్లికి తీవ్ర అనారోగ్యం తప్పదు. చిన్న వయసులోనే పెళ్లిళ్లతో ఇతర రుగ్మతలు కూడా ఎదురుకావొచ్చు. గైనిక్ సమస్యలతో ఆస్పత్రులకు వస్తున్న వారిలో బాల్య వివాహ బాధితులే అధికం. ఈ విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. చేజేతులా వారి పిల్లలను ప్రమాదంలో పడేయొద్దు.

- జి.సునీత, వైద్యురాలు, రాజాం

రాజాం మున్సిపాలిటీలో రోవర్ మిస్సింగ్

- ఓ ట్యాబ్ కూడా..
- విలువ సుమారు రూ.10 లక్షలు
- గత కమిషనర్ హయాంలో మిస్సింగ్

రాజాం రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపల్ కార్యాలయంలో సుమారు పది లక్షల రూపాయలు విలువచేసే రోవర్ చోరీకి గురైంది. దీంతో పాటు ఓ ట్యాబ్ సైతం కనిపించడం లేదని సమాచారం. గతంలో ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్ హయాంలోనే ఈ పరికరం, ట్యాబ్ మిస్ అయినట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీ పరిధిలోని భూములు, చెరువులకు సంబంధించి రీసర్వేకు ఉపయోగించిన ఆ పరికరంతో పాటు ఏడు ట్యాబ్‌లను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలతో పాటు రాజాం మున్సిపాలిటీకి రెండేళ్ల క్రితం ప్రభుత్వం అందజేసింది. తొలిరోజుల్లో పట్టణంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేట, కొత్తవలస, సారధి, పొనుగుటివలస గ్రామాల్లో అప్పటి సర్వేయర్‌తో పాటు అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారి, మున్సిపాలిటీ పరిధిలోని కొంతమంది సచివాలయ ఉద్యోగులతో కూడిన బృందం రోవర్‌తో రీసర్వే నిర్వహించారు. చివరిగా ఏడాది క్రితం కొత్తవలసలో నిర్వహించిన రీసర్వే అనంతరం (మిగతా 6వ పేజీలో..)



రోవర్ లేకపోవడం వాస్తవమే

మున్సిపాలిటీకి గతంలో ప్రభుత్వం సరఫరా చేసిన రోవర్ కనిపించకపోవడం వాస్తవమే. నేను విధుల్లో చేరకముందే ఈ సంఘటన జరిగింది. ఇటీవల కాలంలో రోవర్ లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం నుంచి తెచ్చి రీసర్వే చేయాల్సి వస్తోంది. రోవర్ మిస్ అయిన విషయంపై ఉన్నతాధికారులకు నివేదించాం.

- రామ అప్పలనాయుడు, కమిషనర్, రాజాం మున్సిపాలిటీ.


కార్యాలయంలో మూలన ఉన్న రోవర్ స్టాండ్

ఐక్యంగా మలేరియాను నిర్మూలించాలి

- డీఎంహెచ్‌వో జీవనరాణి

4లో

16 అడుగుల కింగ్‌కోబ్రా పట్టివేత

వేపాడ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చామలాపల్లి గ్రామ శివారు వెంకయ్యపాలెం వెళ్లే రహదారిలో అరిగివానిచెరువు సమీపంలో 16 అడుగుల కింగ్ కోబ్రా(గిరినాగును) శుక్రవారం హల్‌చల్ చేసింది. చీకటి పడుతున్న వేళ అటుగా వెళ్తున్న రైతులు గమనించి భయపడ్డారు. కొందరు బాటసారులు చినదుంగాడ గ్రామంలో ఉన్న స్నేక్ క్యాచర్ వరపల కృష్ణకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన వచ్చి టార్చులైట్ సహాయంతో గిరినాగును చాకచక్యంగా పట్టుకొని ప్రత్యేక గోనె సంచిలో బంధించారు.



ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు వేళాయే

- నాలుగు క్యాంపస్‌ల్లో 4,400 సీట్ల భర్తీకి సన్నాహాలు
- రేపటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 5న ఎంపిక జాబితా విడుదల
- జూన్ 11 నుంచి కౌన్సెలింగ్
- జూన్ 30 నుంచి తరగతులు

4లో



తలసరి ఆదాయం పెరగాలి


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

4లో

- వినూత్న ఆలోచనలతో వ్యవసాయం, ఉద్యాన సాగు
- నెలాఖరులోపు గ్రామస్థాయి ప్రణాళిక సిద్ధం కావాలి
- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

మత్స్యకారులకు మంచి రోజులే!

- వేట నిషేధం సమయంలో పరిహారం రెట్టింపు
- రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంపు
- గంగపుత్రుల్లో ఆనందోత్సాహాలు
- అయితే వలసలు ఆపాలని విన్నవిస్తున్న వైనం
- నేడు ఎచ్చెర్ల నియోజకవర్గానికి సీఎం బాబు రాక
- మత్స్యకారులకు భృతి పంపిణీ



ముక్కాంలో వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

విజయనగరం/భోగాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గంగపుత్రులకు సముద్రమే జీవనాధారం. చేపలవేటే వారికి ప్రధానం. మరే ఇతర పనులు చేయడానికి సాహసించరు. జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ రెండు తీర ప్రాంత మండలాలు ఉన్నాయి. ముక్కాం, చోడిపల్లిపేట, చేపలకంచేరు, పెదకొండ్రాజుపాలెం, చిన కొండ్రాజుపాలెం, ఎర్రముసలయ్య పాలెం, తిప్పలవలస, ముద్దూరు, కొత్తూరు, పతివాడ బర్రిపేట, తమ్మయ్య పాలెం, పులిగెడ్డపాలెం, నీలగెడ్డపేట, చింతపల్లి, పెద్దూరు, బర్రిపేట, కొత్తూరు, బొడ్డగురయ్యపేట తదితర మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. వీటిలో సుమారు 20వేల జనాభా ఉన్నారు. ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా చేపలవేట, అమ్మకాలు తదితర వాటిద్వారా జీవనం పొందుతున్నారు.

అయితే చేపలు సరిగా లభ్యం కాక ప్రతిఏటా సుమారు 1500 మంది పారాదీప్, గుజరాత్, వీరావల్, విశాఖపట్నం, కాకినాడ, ఒడిశాకు వలస వెళ్తున్నారు. చేపలు నిల్వ చేసుకోవడానికి శీతల గిడ్డంగులు, చేపలు అమ్మడానికి స్థలాలు, చేపలు ఆరబోసుకోవడానికి ప్లాట్‌ఫారాలు లేవు. అలాగే వేట సామగ్రి భద్రపరుచుకునేందుకు సౌకర్యాలు లేవు. దీంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు వలలు, పడవలు, వేట సామగ్రి రాయితీలపై అందించలేదు. వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను అన్నివిధాలా మోసం చేస్తూ వచ్చింది. వారిని ఓటుబ్యాంకుగా మాత్రమే చూశారన్న విమర్శలు ఉన్నాయి. వైసీపీ సర్కారు తీరుతో మత్స్యకారులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు వైసీపీ ప్రభుత్వం కొంత మందికి మాత్రమే రూ.10 వేల చొప్పున భృతి అందించేది. అదీకూడా వారి సానుభూతిపరులకు మాత్రమే. అర్హులకు అన్యాయం చేసిందన్న ఆరోపణలు ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారులకు వేటనిషేధ సమయంలో ఇచ్చే పరిహారం రెట్టింపు చేసింది. రూ.10 వేలుగా ఉన్న భృతిని రూ.20వేలకు పెంచింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం రాయితీపై మత్స్యకారులకు అన్ని రకాల వేట సామాగ్రి అందించడానికి సన్నాహాలు చేస్తుంది. అలాగే వలసలు అరికట్టేందుకు జెట్టీ ఏర్పాటుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే వీటిని త్వరగా పూర్తి చేస్తేనే మత్స్యకారుల వలసలు ఆగుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



భృతి రెట్టింపుతో ఆనందంగా ఉంది

గత వైసీపీ ప్రభుత్వం ఏవిధంగానూ మత్స్యకారులను పట్టించుకోలేదు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు జీవనం కష్టమవుతుంది. గత ప్రభుత్వం కొంత మందికి మాత్రమే రూ.10వేలు అందజేసేది. ప్రస్తుత ప్రభుత్వం భృతిని రెట్టింపు చేసి రూ.20వేలు ఇస్తానంటోంది. దీంతో ఆనందంగా ఉంది.

- బడె నాయుడు, మత్స్యకారుడు, ముక్కాం



గత ప్రభుత్వం ఏవిధంగానూ ఆదుకోలేదు




గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను ఏవిధంగానూ ఆదుకోలేదు. వలలు, పడవలు, వేట సామగ్రిని అప్పులు చేసి కొనుగోలు చేశాము. ప్రస్తుత ప్రభుత్వం రాయితీపై వేట సామగ్రి అందించేందుకు చర్యలు చేపట్టడం సంతోషంగా ఉంది. అలాగే వైసీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల వలసలు అధికంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం వలసలు నివారించేలా చర్యలు తీసుకోవాలి.

- గరికిన చినరాము, మత్స్యకారుడు, ముక్కాం

నేడు ఎచ్చెర్లలో సీఎం పర్యటన

- బుడగట్లపాలెంలో మత్స్యకారులకు సాయం పంపిణీ
- గంగపుత్రులతో మాట్లాడనున్న చంద్రబాబునాయుడు
- టీడీపీ కేడర్‌తోనూ ప్రత్యేక సమీక్ష



శ్రీకాకుళం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం విజయనగరం లోక్‌సభ పరిధిలోని ఎచ్చెర్ల మండలం బుడగట్ల పాలెంలో పర్యటించనున్నారు. తాడేపల్లిలో శనివారం ఉదయం 10 గంటలకు సీఎం చంద్రబాబు బయలుదేరి.. 10.35 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 10.40 గంటలకు విమానంలో బయలుదేరి 11.25 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో దిగుతారు. 11.35 గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలు దేరి బుడగట్లపాలెం హెలిప్యాడ్ వద్దకు 11.55 గంటలకు చేరుకుంటారు. 11.55 గంటల నుంచి మధ్యాహ్నం 12.05 వరకు ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారుల నుంచి స్వాగత సత్కారం అందుకుంటారు. 12.20 వరకు ప్రజాప్రతినిధులతో చర్చిస్తారు. 12.25 గంటలకు బుడగట్లపాలెం గ్రామంలోకి ప్రవేశించి అమరావతి దేవాలయాన్ని దర్శించుకుంటారు. అనంతరం స్థాని మత్స్యకారులతో మధ్యాహ్నం 1.15 గంటల వరకు మాట్లాడతారు. 1.15 నుంచి 1.45 వరకు రిజర్వ్‌గా సమయాన్ని కేటాయించారు. 1.50 గంటలకు బుడగట్లపాలెంలో ప్రజావేదిక వద్దకు చేరుకుని జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తారు. 2 గంటల నుంచి 3.40 వరకు సభలో ప్రసంగిస్తారు. 3.45 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని 5.15 వరకు టీడీపీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. 5.25 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 5.50 గంటలకు విశాఖపట్నంలో నేవల్ కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్ వద్దకు చేరుకుం టారు. 5.55 గంటలకు విశాఖపట్నంలో మహారాణి పేట వద్ద ఆంధ్రా మెడికల్ కళాశాలలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు. రాత్రి 7.25 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో బయలుదేరి 8.10గంటలకు విజయవాడ చేరుకుంటారు. 8.50 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలో తన నివాసానికి సీఎం చేరుకుంటారు. సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా అధికారులు పలుదపాలు బుడగట్లపాలెంలో ఏర్పాట్లను పరిశీలించారు. పర్యటనలో ఏవిధమైన అసాంఘిక శక్తు లు చొరబడకుండా 'అడ్వాన్స్ సెక్యూరిటీ లైజెన్' (ఏఎస్ఎల్) టెక్నాలజీతో భద్రతా చర్యలను ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు చేపట్టారు.



కోనేరులో కలువ పూలు

కలువల కనువిందు

పాలకొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పాలకొండ మండలం వెలగవాడ గ్రామానికి ఆనుకుని పాలకొండ-సీతంపేట ప్రధాన రహదారిలో ఉన్న కోనేరులో కలువ పూలు కనువిందు చేస్తున్నాయి. ఆ కోనేరులో ఉన్న పరమశివుని విగ్రహం ముందు ప్రణమిల్లుతున్నట్టు కలువ పువ్వులు కనిపిస్తున్నాయి. గత ఏడాది కోనేరు గర్భంలో గ్రామస్థులు పూడికలను తొలగించి, శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ కోనేరులో వేల సంఖ్యలో కలువ పువ్వులు వికసిస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్ర జ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. మలిచర్ల సర్పంచ్ తుమ్మగంటి రమాకుమారి, వైస్ఎంపీపీ, ఎంపీటీసీ కొసర నిర్మల, వైస్ సర్పంచ్ తుమ్మగంటి చిరంజీవి, మాజీ సర్పంచ్ తుమ్మగంటి అప్పన్న తాత ఆధ్వర్యంలో వైసీపీ మండల యువత అధ్యక్షుడు తుమ్మగంటి సురేష్, నాయకులు కొసర సన్నిబాబు, తుమ్మగంటి బంగారు నాయుడు, తుమ్మగంటి వెంకటరమణ, పతివాడ శ్రీను, కొసర అప్పారావుతోపాటు వార్డు మెంబర్లతోపాటు 600 మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా శుక్రవారం విజయనగరంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి అదితి గజపతిరాజు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీ మండలాధ్యక్షుడు బొద్దల నర్సింగరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

విజయనగరం మండలంలోని గుంకలాం గ్రామానికి చెందిన కెల్ల రమణ కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.మూడు లక్షల చెక్కును ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అందజేశారు. రమణ అనారోగ్యం వల్ల శస్త్రచికిత్స చేయించుకోగా, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె సీఎంఆర్ఎఫ్ నుంచి సాయం అందించారు.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు వేళాయే!

- నాలుగు క్యాంపస్‌ల్లో 4,400 సీట్ల భర్తీకి సన్నాహాలు
- రేపటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 5న ఎంపిక జాబితా విడుదల
- జూన్ 11 నుంచి కౌన్సెలింగ్
- జూన్ 30 నుంచి తరగతులు



ఎచ్చెర్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల కోర్సు.. సీటు వచ్చిందంటే చాలు.. ఉజ్వల భవిత పొందవచ్చు. ప్లస్ 2(పీయూసీ రెండేళ్లు), ఇంజనీరింగ్ నాలుగేళ్ల కోర్సు పూర్తిచేసి ఎంచక్కా అటు నుంచి అటే ఉద్యోగంలో చేరే అద్భుత అవకాశం. ఇదీ ట్రిపుల్ ఐటీ ప్రత్యేకత. అందుకే ఈ కోర్సులో చేరేందుకు చాలామంది విద్యార్థులు ఇష్టపడుతుంటారు. ఇటీవల పదో తరగతి ఫలితాలు వెల్లడైన వేళ.. ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. మన రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలో శ్రీకాకుళం(ఎచ్చెర్లలోని ఎస్.ఎం.పురం), నూజివీడు, ఒంగోలు, ఇడుపులపాయ(ఆర్కే వ్యాలీ)లో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు ఉన్నాయి. ఈ క్యాంపస్‌ల్లో అడ్మిషన్లకు ఆర్జీయూకేటీ ఈ నెల 24న నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు ఈ నెల 27 నుంచి మే 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. పదో తరగతిలో మార్కులు, రిజర్వేషన్ ప్రాతిపదికన మెరిట్ జాబితాను రూపొందించి.. కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లను కేటాయిస్తారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రత్యేకం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు ట్రిపుల్ ఐటీలను ప్రారంభించారు. తొలుత నూజివీడు, ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీలు ఉండేవి. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకాకుళం, ఒంగోలులో 9ఏళ్ల కిందట ట్రిపుల్ ఐటీలను ప్రారంభించారు. ఇందులో సీటు పొందే ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్ ఉంటుందనడంలో సందేహంలేదు. క్యాంపస్ నుంచే బహుళ జాతి కంపెనీల్లోకి ఉద్యోగాల్లోకి వెళ్లే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

కోర్సులివే

ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్నాయి. నూజివీడు, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌ల్లో వీటితోపాటు మెటీరియల్ సైన్స్ అండ్ మెటలర్జికల్ సైన్స్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ కోర్సులు అదనంగా ఉన్నాయి.

ఇవీ అర్హతలు

పదోతరగతి లేదా తత్సమాన పరీక్షల్లో 2024-25 విద్యా సంవత్సరంలో రెగ్యులర్ విద్యార్థులుగా తొలి ప్రయత్నంలో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసేందుకు అర్హులు. ఓసీ, ఈడబ్ల్యూఎస్, బీసీ విద్యార్థులు రూ.300, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.200 దరఖాస్తు రుసుం చెల్లించాలి. మొత్తం సీట్లలో 85శాతం లోకల్ విద్యార్థులకు(ఆంధ్రప్రదేశ్), 15 శాతం ఓపెన్ సీట్లు ఏపీ, తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు పదోతరగతి మార్కులకు 0.4 గ్రేస్ పాయింట్లను అదనంగా కేటాయిస్తారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఆర్జీయూకేటీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

జూన్ 5న ఎంపిక జాబితా

ఆర్జీయూకేటీ పరిధిలో ట్రిపుల్ ఐటీలో సీటుకు ఎంపికైన అభ్యర్థుల జాబితా జూన్ 5న ప్రకటిస్తారు. జూన్ 11 నుంచి 17 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. నూజివీడు క్యాంపస్‌లో పీహెచ్‌సీ, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, స్కౌట్స్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. ఒక్కో క్యాంపస్‌లో వెయ్యి సీట్లు, అదనంగా ఈడబ్ల్యూఎస్ కింద మరో 100 సీట్లు ఉంటాయి. మొత్తం ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌ల్లో 4,400 సీట్లను భర్తీ చేస్తారు. పీయూసీకి ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.45 వేలు, ఇంజనీరింగ్‌కు ఏడాదికి రూ.50 వేలుగా నిర్ణయించారు. తెలుగేతర రాష్ట్రాల వారికి 25 శాతం సూపర్ న్యూమరీ సీట్లు అందుబాటులో ఉంటాయి. ఈ అభ్యర్థులు ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.1.50 లక్షలు చెల్లించాలి.

గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు నిర్దేశించిన గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. నిర్దేశించిన అంశాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తు చేయాలి. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- కేవీజీడీ బాలాజీ,
ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, శ్రీకాకుళం క్యాంపస్



శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్

తలసరి ఆదాయం పెరగాలి

- వినూత్న ఆలోచనలతో వ్యవసాయం, ఉద్యాన సాగు
- నెలాఖరులోపు గ్రామస్థాయి ప్రణాళిక సిద్ధం కావాలి
- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

చీపురుపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల తలసరి ఆదాయం పెంపునకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. తద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపడతాయన్నారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు, ముఖ్యంగా గ్రామస్థాయి సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. వినూత్నంగా ఆలోచించి వ్యవసాయం, ఉద్యాన సాగుల్లో నూతన ఒరవడి తేవాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా గ్రామస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. చీపురుపల్లిలో శుక్రవారం జరిగిన నియోజవర్గ క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో తలసరి ఆదాయం 12.24 శాతం ఉండగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి 15.84 శాతానికి పెంచాల్సి ఉందన్నారు. వ్యవసాయానికి అనువైన భూమి జిల్లాలో 3 లక్షల ఎకరాలు ఉండగా, ప్రస్తుతం కేవలం 1.8 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగవుతున్నాయని తెలిపారు. మిగిలిన భూమిని కూడా సాగులోకి తీసుకురావాలని కోరారు. అంతర పంటలు, వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. వేసవి కాలంలో సాగయ్యే పంటలపై రైతుల్ని చైతన్యవంతం చేయాలన్నారు. రబీ సాగుకు జిల్లా రైతులు విము ఖంగా ఉంటారని, ఈ పరిస్థితి మారాలన్నారు. జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు 6,600 ఉన్నట్టు గణాంకాలు చెబుతు న్నాయని, వీటిలో ఎన్ని పనిచేస్తున్నాయో, మూతపడినవెన్నో తెలుసుకుని పరిశ్రమల రంగాన్ని ప్రోత్సహించాలన్నారు. నియోజక వర్గ కేంద్రాల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. 2026 నాటికి భోగాపురం విమానాశ్రయం పూర్తయితే, ఆ రంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. టెంపుల్, ఎకో టూరిజాల అభివృద్ధికి జిల్లాలో అవకాశం ఉందన్నారు. గ్రామాల్లోని పరిస్థితులను, అందుబాటులో ఉన్న వనరులను పూర్తిగా అధ్యయనం చేసి ఈ నెల 30 నాటికి ప్రణాళికలు అందించాలన్నారు. సమావేశంలో సీపీవో బాలాజీ, వ్యవసాయ జేడీ రామారావు, పశు సంవర్ధకశాఖ జేడీ రమణ, ఉద్యానవన శాఖ డీడీ జమదగ్ని, ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ, ప్రత్యేకాధికారి రాజేశ్వరి, ఆర్డీవో సత్యవాణి, ప్రకృతి వ్యవసాయం డీసీఎం ఆనందరావు, చీపురుపల్లి ఎంపీడీవో, తహసీల్దారు ఐ.సురేష్, ఎన్.రాజారావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కలెక్టర్ తిలకించారు.



హాజరైన అధికారులు, సిబ్బంది



ప్రకృతి సాగు ద్వారా పండించిన కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఐక్యంగా మలేరియాను నిర్మూలించాలి

- డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఐక్యంగా శమించి మలేరియాని నిర్మూలించాలని డీఎంహెచ్‌వో జీవనరాణి పిలుపునిచ్చారు. శుక్రవారం విజయనగరం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 157 గ్రామాలను మలేరియా అధిక ప్రభావిత గ్రామాలుగా గుర్తించామని, దోమల నిర్మూలనకు రెండు విడతల్లో మందు పిచికారీ చేస్తామన్నారు. మే 15 నుంచి తొలి విడత ప్రారంభం కానుందని తెలిపారు. ర్యాలీ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుంచి కలెక్టరేట్ వరకూ సాగింది.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి



రాముడువలస వద్ద తోటపల్లి కాలువ

చెంతనే ఉన్నా సాగునీటికి చింత

●బాడంగి, బొబ్బిలి మండలాల ఆయకట్టుకు అందని నీరు ●ఇదీ తోటపల్లి ప్రధాన కాలువ పరిధిలో పరిస్థితి

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి, బాడంగి మండలాలకు ఆనుకుని తోటపల్లి ప్రధాన కాలువ పారుతున్నా ఆయకట్టుకు నీరందకపోవడంతో అన్నదాతలు నిరాశకు గురవుతున్నారు. తమ చెంత నుంచే కాలువలు వెళ్తున్నా నీరందడంలేదని వాపోతున్నారు. దీంతో ఏటా వర్షాలపై ఆధారపడాల్సివస్తోందని వాపోతున్నారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, స్పందించి తమ ఆయకట్టుకు నీరందిచేందుకు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటుచేయాలని రెండు మండలాల రైతులు కోరుతున్నారు.

బొబ్బిలి మండలంలోని చింతాడ, రాముడువలస, శివడవలస,పక్కి, బాడంగి మండలంలోని పాల్తేరు, ముగడ, బాడంగి తదితర గ్రామాలకు ఆనుకుని తోటపల్లి ప్రధాన కాలువ పారుతోంది. రెండుదశాబ్దాల కిందట శ్రీకాకుళం జిల్లాలోనిపలు ప్రాంతాలకు సాగు,తాగు నీరందించేందుకు తోటపల్లి కాలువలను ఏర్పాటుచేశారు.అయితే ఇక్కడ బొబ్బిలి మండలంలో కాలువ అలైన్‌మెంట్ సమయంలో లోతుగా కాలువలు తవ్వారు.దీంతో ఇక్కడ పంటపొలాలు ఎత్తు ప్రాంతంలో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో బాడంగి, బొబ్బిలి మండలాల్లోని సుమారు ఐదు వేల ఎకరాలకు ఆనుకుని కాలువలు వెళ్తున్నా నీరందని పరిస్థితి నెలకొంది. రాముడువలస వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తే ఇక్కడి ఆయకట్టుకు నీరందుతుందని దశాబ్ద కాలంగా రైతులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్తున్నా ఫలితం ఉండడంలేదు.తాము కాలువల నిర్మాణంకోసం భూములు ఇచ్చినా ఆయకట్టుకు నీరందడంలేదని వాపోతున్నారు. వైసీపీ హయాంలో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు సమస్యను వివరించినట్లు రైతులు చెబుతున్నారు.గత్యంతరంలేక నేలబావులు, చెరువుల్లోని నీటిని ఆయిల్ ఇంజిన్లతో తోడి సాగు చేస్తున్నామని రైతులు వాపోతున్నారు.

చికిత్సపొందుతూ దివ్యాంగుడి మృతి

నెల్లిమర్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన దివ్యాంగుడు అట్టాడ పూడినాయుడు (38) చికిత్స పొందుతు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.గురువారం రాత్రి పది గంటల సమయంలో పాముకాటు వేయడంతో కుటుంసభ్యులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు అక్కడ చికిత్స పొందుతు మృతి చెందాడు.

48 మద్యం సీసాల స్వాధీనం

విజయనగరం క్రైమ్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని టూటౌన్ స్టేషన్ పరిధిలోని వైఎస్ఆర్‌నగర్ జంక్షన్‌లో శుక్రవారం సీఐ టి.శ్రీనివాసరావు, ఎస్ఐ కృష్ణమూర్తి వాహనతనిఖీలు చేస్తుండగా అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి పట్టుబడ్డాడు.ఈమేరకు బొండపల్లి మండలంలోని కెరటాం గ్రామానికి చెందిన పతివాడ సంతోష్‌కుమార్ విశాఖలో 48 మద్యంసీసాలు కొనుగోలుచేసి తీసుకువస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.ఆయనపై కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

త్వరితగతిన డాగ్స్ కెన్నర్ల నిర్మాణం: ఎస్పీ



జిల్లా ప్రధాన న్యాయాధికారి బబితకు మొక్క అందజేస్తున్న వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖలో నేరాల ఛేదనలో విశేషంగా పనిచేస్తున్న పోలీసు డాగ్స్ విశ్రాంతి తీసుకునేందుకు నిర్మాణంలోఉన్న డాగ్స్ కెన్నర్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వకుల్‌జిందాల్ చెప్పారు. పాత పోలీసు క్వార్టర్స్‌లో ఉన్న పోలీసు డాగ్ కెన్నర్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. పోలీసు డాగ్స్ సంక్షేమానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకంగా శాశ్వతమైన కెన్నర్స్ లేకపోవడంతో ఏఆర్ పోలీసు లైన్స్‌లోని పాత పోలీసు క్వార్టర్స్‌ను తాత్కాలికంగా వినియోగిస్తున్నామన్నారు. గతంలో నిర్మించి సగంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎస్పీ వెంట ఎస్బీ సీఐ లీలారావు, సెక్యూరిటీ ఆర్ఐ పి.శ్రీనివాసరావు, డాగ్ హేండ్లర్స్ ఉన్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం

జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వేల్ఫేర్ డే నిర్వహించి సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు.వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖపరమైన సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన ఎస్పీ

జిల్లా ప్రధాన న్యాయాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎం.బబితను ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగి నిందితులను శిక్షించేలా పోలీసు, న్యాయశాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

చర్చిలో బాలిక మృతిపై దర్యాప్తు: వెస్ట్ ఏసీపీ

కంచరపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం సెయింట్‌పీటర్ చర్చి ప్రాంగణంలో గురువారం మృతిచెందిన డెంకాడ మండలానికి చెందిన ఈదల పూర్ణచంద్రిక(11) మృతిపై దర్యాప్తు పూర్తయ్యాక వివరాలు తెలియజేస్తామని వెస్ట్ ఏసీపీ పృథ్వీతేజ పేర్కొన్నారు. ఈ కేసు వివరాలను కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. పూర్ణచంద్రికకు ఇరవై రోజులుగా మానసిక సమస్య ఉండడంతో తల్లి, అమ్మమ్మ గురువారం జ్ఞానాపురంలో గల చర్చి వద్దకు ప్రార్థనల కోసం బాలికను తీసుకువచ్చారు. అక్కడ నుంచి కొత్తవలసలో కూడా ప్రార్థనలు చేసి గురువారం సాయంత్రానికి మళ్లీ జ్ఞానాపురం చర్చి వద్దకు తీసుకువచ్చారు. చర్చిలో ఎవరూ లేకపోవడంతో బయట కూర్చొని ప్రార్థనలు చేశారు. బాలిక గట్టిగా అరవడం, హింసాత్మకంగా ప్రవర్తించడంతో అమ్మమ్మ, తల్లి గుడ్డతో ఆమె ముఖంపై కప్పారు. అప్పటికే నీరసంగా ఉన్న బాలిక కాసేపటికే ఉలుకు పలుకు లేదు. చర్చి మైదానంలో జనం చేరడంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి బాలికను పరిశీలించగా, అప్పటికే ఆమె మృతి చెందింది. బాలిక తల్లిదండ్రుల గొడవల కారణంగా నాలుగేళ్లుగా విడిగా ఉంటున్నారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఏసీపీ పృథ్వీతేజ్ వివరించారు. బాలిక ఊపిరాడక మృతి చెందిందా? మరే ఇతర కారణాలు ఉన్నాయా? అన్నది దర్యాప్తులో తెలుస్తుందన్నారు.

అదాని కంపెనీని అడ్డుకుంటాం

●ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జగన్

వేపాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కరకవలస శివారు మారికలో అదాని కంపెనీ రాకుండా అడ్డుకుంటామని సీపీఎం నాయకుడు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇక్కడ మారిక గిరిజనులతో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారిక రెవెన్యూలో 35 సర్వేనెంబర్లు ఉంటే అందులో 32 సర్వేనెంబరులో అదాని గ్రూపు హైడ్రో పవర్ కంపెనీ ఏర్పాటు చేసేందుకు భూములు అప్పగిస్తామని గురువారంకలెక్టర్ నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమన్నారు. మారిక గ్రామాన్ని అదానీ కంపెనీకి అప్పగించే నిర్ణయం వెనక్కితీసుకోకపోతే పోరాటం ఉధృతంచేస్తామని హెచ్చరించారు.

లాకౌట్ విధించడం సమంజసం కాదు

కొత్తవలస, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):ఎప్పటికప్పుడు కర్మాగారం యాజమాన్యం లాకౌట్ విధించి కార్మికులను వీధినపడేయడం ఎంతవరకు సమంజసమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ ప్రశ్నించారు. శుక్రవారం జిందాల్‌నగర్‌లో గల జేఎస్ఎల్ కర్మాగారంలో యాజమాన్యం చట్ట విరుద్ధంగా విధించిన లాకౌట్‌కు నిరసనగా కర్మాగారానికి చెందిన మూడు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి ఆయన సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం పరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్న కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. లాకౌట్ కాలమంతా కార్మికులకు వేతనం చెల్లించేందుకు అంగీకరించి నోటీసు బోర్డులో పెట్టాలన్నారు. గతంలో ఇవన్నీ వ్యవసాయ భూములని, పరిశ్రమ ఏర్పాటైతే తమ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని భూములిచ్చారని తెలిపారు. వారి ఆశలను కూడా నిర్వీర్యం చేసి కర్మాగారం ఏర్పాటు చేసి లాభాలు వచ్చినంత వరకు తిప్పి నష్టాలు వస్తున్నాయని మూసేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

14 బీసీ వసతిగృహాల్లో శతశాతం ఉత్తీర్ణత

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో బీసీ వసతిగృహాల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు సత్తాచాటారు. 32 వసతి గృహాలకు గాను 14 హాస్టళ్ల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. మూడు వసతి గృహాల్లో 50 శాతం ఫలితాలు వచ్చాయని ఈ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని బొప్పాడాం, రావాడ, కలవచర్ల, భోగాపురం, బోనంగి, జోన్నవలస, దేవుపల్లి, పెదతాడివాడ, ఎస్.కోట, ఎంఎస్ఆర్‌పురం, సిరిపురం,సంతకవిటి, దత్తిరాజేరు, బొబ్బిలి వసతి గృహాల్లో శతశాతం ఫలితాలు సాధించారు.

మలేరియాను తరిమికొట్టాలి

ఐక్యంగా శ్రమించి మలేరియాను తరిమికొట్టాలని వైద్యాధికారులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు.

●విజయనగరం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):రాకోడులో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు అఖిల మాట్లాడుతూ మలేరియావ్యాధి పట్ల ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. కార్యక్రమంలో రాకోడు పీహెచ్‌సీ సిబ్బంది సీహెచ్ మాణిక్యం, శ్రీరామమూర్తి, శ్రీనివాసరావు, కళావతి, ల్యాబ్ టెక్నీషియన్ అప్పలనాయుడు, ఫార్మాసిస్టు ప్రసాద్ పాల్గొన్నారు.

●రాజాం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సకాలంలో వైద్య పరీక్షలు, చికిత్స పద్ధతులు ఉపయోగించి మలేరియా నిర్మూలించాలని పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.భార్గవి తెలిపారు. పొగిరి పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ మలేరియా నిర్మూలనపై తగిన శ్రద్ధ, తగిన వనరులను సద్వినియోగం అవసరమన్నారు.

నేడు రారవే సమావేశం

రాజాం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాజాంలో స్థానిక రచయితల వేదిక (రారవే) 123వ సమావేశం శనివారం జరుగుతుందని నిర్వాహకుడు గార రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీవేత్త మూడడ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో నెమ్మి నీలం కథలు పరిశీలన అనే అంశంపై పొదిలాపు శ్రీనివాసరావు ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

రేపు ప్రవేశపరీక్ష

లక్కవరపుకోట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలల్లో ఐదోతరగతిలో ప్రవేశానికి పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్లు స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ యువీకే పాత్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు జరిగే పరీక్షకు అరగంట ముందు కేంద్రానికి అభ్యర్థులు చేరుకోవాలని కోరారు.

2న బీచ్ కబడ్డీ పోటీలు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీపోటీలు మేరెండో తేదీ నుంచి రెండు రోజులపాటు జరగనున్నాయని నిర్వాహకులు ఐవీపీరాజు, రంగారావు దొర, కేవీ ప్రభావతి, శివ, లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే స్త్రీ, పురుష క్రీడాకారుల ఎంపికప్రక్రియ ఆదివారం సారిపల్లిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఐశ్వర్య

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా విజయనగరం సంతపేట ప్రాంతానికి చెందిన బూర ఐశ్వర్య యాదవ్‌ను నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలోని ఆంధ్రాభవన్‌లోజరిగిన కార్యక్రమంలో ఆమెకు నియామక ఉత్తర్వులు అందజేశారు.కార్యక్రమంలో విజయనగరం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరిపి విద్యాసాగర్, జిల్లా ఇన్‌ఛార్జి ఉమాశంకర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐక్యంగా ముందుకువెళ్తున్నాం

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్ర జిల్లాల్లో తూర్పుకాపు సామాజిక వేదిక ఒకే కార్యవర్గంతో ఐక్యంగా ముందుకువెళ్తున్నామని తూర్పుకాపు సామాజిక వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి అప్పారావు తెలిపారు.శుక్రవారం విజయనగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇప్పటివరకూ తూర్పుకాపుల్లో ఎటువంటి గ్రూప్‌లు లేవన్నారు.కార్యక్రమంలో రొంగలి రామారావు, ఆర్లి కృష్ణ, పిన్నింటి సూర్యనారాయణ, నాగభూషణం, గిరిడ అప్పలనాయుడు, రామారావు పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి ఎక్స్‌లెన్స్ అవార్డు

భోగాపురం, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీ పరిధిలో గల సుందరపేట సమీపంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి(సీహెచ్‌సీ) నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్(నాకో) ఎక్స్‌లెన్స్‌అవార్డు అందజేసిందని సీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటరమణ శుక్రవారం తెలిపారు. సీహెచ్‌సీలో హెచ్ఐవీ రోగులకు నిరంతరం అందజేస్తున్న సేవలు, రోగుల పట్ల ఆదరణ గుర్తించి అవార్డును ఆంధ్రా మెడికల్ కాలేజ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మైక్రోబయాలజీ హెచ్‌వోడీస్ రత్నకుమారి, శివకళ్యాణి సీనియర్ మెడికల్ లేబోరేటరీ టెక్నీషియన్ కళ్లేపల్లి రామకృష్ణకు అందజేశారని చెప్పారు.

ఉపాధి కల్పించండి

గుర్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వేతనదారులకు ఉపాధిహామీ పనులు కల్పించాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు.శుక్రవారం గుర్ల మండల పరిషత్ కార్యాలయంలోఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్షించి అధికారుల పనితీరును శ్రీనివాసరావు అడిగితెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో వంద రోజుల ఉపాధి కల్పనతో ప్రతి వేతనదారుడిగి గిట్టుబాటు కూలీ లభించేదని తెలిపారు.వేసవిలో గ్రామాల వారీగా తాగునీరు సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని జడ్పీ చైర్మన్ ఆదేశించారు. బూర్లెపేట గ్రామానికి తాగునీటి సమస్య ఉందని ఎంపీటీసీ జోగినాయుడు సభ దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధిహామీ పథకంలో నచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారని ఏపీవో తీరుపై సర్పంచ్‌లు నరసింహ మూర్తి, గోవింద్, ఎంపీటీసీలు రామకృష్ణ, జోగునాయుడు మండిపడ్డారు.కార్యక్రమంలో జడ్పీటీసీ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ లక్ష్మి, తిరుపతిరావు, ఎంపీడీవో శేషుబాబు, డీటీ నారాయణమ్మ పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

●మిగులు భూములు సాగులోకి తీసుకురావాలి: కలెక్టర్ అంబేద్కర్



రాజాం రూరల్: పాల ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న అంబేద్కర్

రాజాం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. రాజాంలో నియోజకవర్గ క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా తలసరి ఆదాయం పెరిగే మార్గాలపై దృష్టి సారించాలన్నారు. సాగుచేయని మిగులు భూముల్ని దశలవారీగా సాగులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. భోగాపురం విమానాశ్రయం ఏర్పాటైతే టూరిజం అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. తొలుత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను కలెక్టర్ అంబేడ్కర్ పరిశీలించారు. రైతులకు నవధాన్యాల కిట్లు అందజేశారు. సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారి బాలాజీ, వ్యవసాయ, పశుసంవర్థక, ఉద్యానవనశాఖ జేడీలు వీటీ రామారావు, వైవీ రమణ,ఏవీఎస్వీ జమదగ్ని, ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ శాఖాపరమైన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఆసయ్య, చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనందరావు పాల్గొన్నారు.

రెండు పూటలా పనులు చేయించండి

రాజాం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులకు రెండుపూటలా పనులు చేయించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు.అత్యధిక వేతనం వచ్చేలా పనులు నిర్వహించాలని కోరారు. శుక్రవారం రాజాం మండలపరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో అధికారులతో ఉపాధి హామీ పథకం పనుల తీరు, వేతనదారులు అందుకుంటున్న సగటు వేతనంపై సమీక్షించారు. సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎండ తీవ్రత లేని సమయంలో పనులు నిర్వహించాలని ఆదేశించారు. ఉదయాన్నే వీలైనంత వేగంగా పనులు మొదలయ్యేలా, వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా తగిన చర్యలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తాగునీరు, నీడ సదుపాయం కల్పించాలని తెలిపారు. వేతనదారులకు రోజుకి రూ.307 వరకు అందుకొనే అవకాశముందని, పనులను పెంచి గరిష్ఠ వేతనం అందుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయంలో ఎవరు జాప్యం చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, ఆర్డీవో సత్యవాణి, ఎంపీడీవోలు, ఏపీవోలు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు

సుపరిపాలన అందించేందుకు కృషి

● నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):సుపరిపాలన అందించేందుకు కృషిచేస్తానని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఒమ్మి గ్రామంలో జనవాణి-మాధవమ్మ భరోసా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి వీధుల్లో పారిశుధ్యంపై ఆరాతీశారు. గ్రామస్థుల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంబళ్ల అప్పలనాయుడు, చనమల్లు వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు, యడ్ల గోవిందరావు, గదల అచ్చింనాయుడు, పతివాడ గోవిందరావు, బీజేపీ నాయకుడు గోవిందరావు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో వాగ్వాదం

నెల్లిమర్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిల్ సన్నాహక సమావేశంలో మరోసారి వాగ్వాదం చోటుచేసుకుంది, ఈ నెల 29వ తేదీన జరగనున్న కౌన్సిల్ సమావేశంలో చర్చించనున్న అంశాలను ఖరారు చేసేందుకు శుక్రవారం చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఒకటో వార్డు కౌన్సిలర్ కింతాడ కళావతి గదిలో ప్రవేశించగా, కూర్చోవడానికి కుర్చీ ఖాళీ లేకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లకు విలువ లేకుండా పోతోందని, ఎటువంటి పదవులు లేని ఇతరులు సమావేశంలోనికి చొరబడి కుర్చీలు ఆక్రమించుకుంటున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో చైర్‌పర్సన్, కళావతి మధ్య వాగ్వాదానికి దారి తీసింది. వైస్ చైర్మన్ రామారావు జోక్యం చేసుకుని ఇద్దరికి సర్దిచెప్పారు. అనంతరం పలు అంశాలపై వాడివేడి చర్చ జరిగింది. సమావేశంలో కమిషనర్ తారక్‌నాథ్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వం ధ్యేయం

●రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



సంతకవిటి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

సంతకవిటి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు.శుక్రవారం మండలంలోని అప్పలగ్రహారం నుంచి మంతిన మల్లయ్యపేట వరకు, జీఎన్ పురం నుంచి బూరాడపేట వరకు, ఎంఆర్ అగ్రహారం నుంచి కొత్తూరు రామచంద్రపురం వరకు, శ్రీహరినాయుడుపేట జంక్షన్ నుంచి కొండగూడెం వరకు బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదదాడిని ఖండించి, రెండు నిమషాలు మౌనం పాటించారు. అనంతరం వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు కొల్ల అప్పలనాయుడు, కోండ్రు జగదీష్, వల్లూరు గణేష్, గట్టి భాను, రఘు, గురవాన నారాయణరావు, సమతం శ్రీను, చెలికాని మహేష్, రావు రవీంద్ర, దుప్పలపూడి శ్రీను, దూబ ధర్మారావు, మొయ్యి నారాయణప్పడు పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

రాజాం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):రాజాంనుమోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం రాత్రి శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో వంగర మండలం, రాజాం పట్టణ టీడీపీ అనుబంధ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గం టీడీపీ పరిశీలకుడు సూరాడ చంద్రమోహన్, టీడీపీ పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, పిన్నింటి మోహన్‌రావు ,గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల కేశఖండనశాలల్లోవిధులు నిర్వర్తించే నాయీ బ్రాహ్మణులకు కమీషన్ రూ.25వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతోనాయీబ్రాహ్మణుల సంఘం నాయకులు మురళీమోహన్‌ను సన్మానించారు.

కూలీలు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

బొండపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల కోసం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజనకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో కె.తులసీనాథ్ కోరారు.శుక్రవారంబొండపల్లి జగన్నబందలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బీమా పథకంపై కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో జి.అరుణ పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులివ్వండి: జేసీ



కొత్తవలసలో విచారణ నిర్వహిస్తున్న సేతు మాధవన్

కొత్తవలస, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో ప్రభుత్వభూముల ఆక్రమణదారులకు నోటీసులివ్వాలని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ తెలిపారు. వారి వద్ద ఉన్న ఆధారాలతో విజయనగరంలోని కలెక్టరేట్‌కు రావాలని ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం కొత్తవలసలోని కొత్తవలస -విజయనగరం లో రోడ్డులో గల సర్వేనెంబర్ 141, 142ల్లో గల ప్రభుత్వ, వాగు భూములు పరిశీలించారు. ఈ భూములకు సంబంధించి రెవెన్యూశాఖఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో జేసీ పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ నీలకంఠరావునుభూములు గురించి అడిగి తెలుసుకున్నారు. తొలుత కంటకాపల్లి గ్రామ రెవెన్యూకు సంబంధించిన భూములను పరిశీలించారు.

రోడ్డు పనులు వేగంగా పూర్తిచేయాలి

శృంగవరపుకోటరూరల్, ఏప్రిల్ 25:మండలంలోని దారపర్తి పంచాయతీ పరిధిలో ఉన్న గతంలో రహదారి నిర్మాణం ప్రారంభమైందని, దీనిని వేగవంతంగా పూర్తి చేయించే చర్యలు చేపట్టాని ఉపముఖ్యమంత్రి పవణ్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని జనసేననాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు తెలిపారు.ఈ మేరకు శుక్రవారం రోడ్డు పనులు పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం అలసత్వం వల్ల గిరిజనులకు శాపంగా మారి రోడ్డు నిర్మాణం జరగలేదని ఆరోపించారు.

పోస్టల్ సేవల పరిశీలన



ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రకాశ్

భోగాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ పోర్టుకు భోగాపురం పోస్టాఫీసుకు దూరం, ప్రయాణం, పోస్టల్ సేవలు, తదితర విషయాలను ఆంధ్రప్రదేశ్ పోస్టల్ శాఖ చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ కె.ప్రకాశ్ పరిశీలించారు. ఎయిర్ పోర్టు నిర్మాణం జరుగుతుండడంతో ఈ ప్రాంతంలో జాతీయ, అంతర్జాతీయంగా పోస్టల్ సేవలందించేలా చర్యలు చేపట్టే విధంగా ఉండేందుకు శుక్రవారం ప్రకాశ్ పర్యటించారు. తొలుత భోగాపురం సబ్‌పోస్టు ఆఫీసును పరిశీలించారు. ఇక్కడ పోస్టల్ సేవలు వినియోగం, వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు.అనంతరం మండల కార్యాలయాల కూడలిలో పోస్టాఫీసుకు కేటాయించిన స్థలాన్ని,ఎయిర్‌పోర్టు ప్రాంతాన్ని పరిశీలించారు.పోస్టల్ శాఖ ఉద్యోగులకు పలు సూచనలుచేశారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ కొల్లూరు శ్రీనివాసులు, ఏఎస్‌పీలు కె.మధుసూదనరావు, పి.సుందరనాయుడు, సబ్‌పోస్టుమాస్టర్ పప్పల శ్రీనివాస్, ఏపీఎం జి.రవి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు ఎక్కువశాతం ఇవ్వాలి

భోగాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ శాతం ఎరువులు ఇఫ్కో నుంచి ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ (ఇఫ్కో) డైరెక్టర్ కర్రోతు కర్రోతు బంగారాజు కోరారు.ఈమేరకు శుక్రవారండిల్లీలో ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ కార్యాలయంలో నిర్వహించిన 595వబోర్డు సమావేశానికి బంగారాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐదేళ్లుగా ఏపీకి ఎరువులు కేటాయింపు తగ్గుతూ వస్తోందని, దీంతో సకాలంలో అందక రైతులు ఇబ్బందులకు గురవుతుండడంతో ఎక్కువ శాతం కేటాయించాలని ఇఫ్కోచైర్మన్ దిలీప్‌సంఘానికి వినతిపత్రం అందజేశారు.

ప్రవీణ్ మృతిపై దర్యాప్తు నిర్వహించాలి

వేపాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పడాల మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐతో దర్యాప్తు నిర్వహించాలని ఏపీ దళిత కూలీ రైతు సంఘం మండలాధ్యక్షుడు దేబారిక కిరణ్ కోరారు. శుక్రవారం వేపాడలో విలేకరులతో మాట్లాడుతూ ప్రవీన్ మృతి ఘటనపై ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలంటే ప్రభుత్వం రీ పోస్టుమార్టం చేయించాలని కోరరు. కార్యక్రమంలో దళితకూలీ రైతు సంఘం కార్యకర్తలు బి.అప్పారావు, బంగారయ్య, పి.సుధాకర్ పాల్గొన్నారు.

టీకాలు శతశతం పూర్తిచేయండి: డీఎంహెచ్‌వో

వేపాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో డెలివరీలు, ల్యాబ్ పరీక్షలు, వ్యాక్సిన్, డీపీ సేవలు, ఏఎమ్సీఐ రిస్కు కేసులు, వ్యాధి నిరోధక టీకాలు శతశాతం పూర్తి చేయాలని సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జీవనరాణి ఆదేశించారు. శుక్రవారం వేపాడ పీహెచ్‌సీని జీవనరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.

నిరంతర వైద్య సేవలందించాలి

లక్కవరపుకోట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పీహెచ్‌సీల ద్వారా నిరంతరం వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి జీవనరాణి వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం ఎల్.కోట పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ల్యాబ్, ప్రసూతి గది, మందుల రూమ్ పరిశరాలను పరిశీలించారు. నిరంతరంగా రోగులను తనిఖీలు చేయాలన్నారు. తొలుత మలేరియా దినోత్సవం పురస్కరించుకుని ఎల్.కోటలో వైద్యుడు అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకులాల ప్రవేశ పరీక్ష

విజయనగరం కలెక్టరేట్ ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 5,6,7,8 తరగతులకు సంబంధించి ప్రవేశాలకు ఉదయం జరిగిన ఏపీఆర్ఎస్‌సీఏటీ పరీక్షకు 1,288 మంది హాజరు కావాల్సి ఉండగా 1064 మంది రాశారు. మధ్యాహ్నం జరిగిన ఏపీఆర్‌జేసీకి 2104 మంది రాయల్సి ఉండగా 1894 మంది రాశారు. ఏపీఆర్‌డీసీకి సంబంధించి 77 మంది హాజరు కావాల్సి ఉండగా 65 మంది రాశారు. విజయనగరంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను డీఈవో మాణిక్యం నాయుడు, డీసీఈబీ సెక్రటరీ టి.సన్యాసిరాజులు తనిఖీ చేశారు.

వల్లంపూడి ఎస్ఐగా సుదర్శన్

వేపాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వల్లంపూడి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఎస్.సుదర్శన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొత్తవలస నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా బాధతలు నిర్వహించిన బొడ్డి దేవిని వీఆర్‌లో ఉంచిన విషయం విదితమే.

మార్పుతేని మార్టులు

(మూడో పేజీ తరువాయి)

కావాలనుకున్న వారు ఆన్‌లైన్‌లోనూ ఆర్డర్ చేయొచ్చని చెప్పి దానికొక లింక్‌ను క్రియేట్ చేశారు. ఆ లింక్‌ను సంబంధిత గ్రూపుల్లో పెట్టి విస్తృతంగా ప్రచారం చేశారు. ఎప్పటిలాగే ఒత్తిడి కూడా తెచ్చారు. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలందరూ ఈ లింక్‌ను క్లిక్ చేసి ఏదో ఒక వస్తువుకు ఆర్డర్ చేయాలని హుకుం జారీ చేశారు. దీంతో చాలా మంది సరుకుల కోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్లు బుక్ చేశారు. గరివిడి, ఎస్.కోట మార్టులతో బాటు జిల్లాలో ఇత్తడి సామగ్రి తయారీలో పేరొందిన మెరకముడిదాం మండలంలోని బుదరాయవలసను కూడా చేర్చారు. ఇత్తడి సామగ్రి ప్యాక్ చేసే పనిని వెలుగు కార్యాలయానికి చెందిన సీసీలు, వీఓఏలు, ఇతర సిబ్బందికి అప్పగించారు. అయితే ప్యాకింగ్ పూర్తి చేసుకున్న సరుకులను ఆన్‌లైన్‌లో ఆర్డర్లు బుక్ చేసిన వినియోగదారులకు పంపించడం వెలుగు సిబ్బందికి ప్రశ్నార్థకంగా మారింది. సరుకు రవాణా ఒక ఎత్తైతే, రవాణా చార్జీలు ఎవరు భరిస్తారన్న ప్రశ్న కూడా ఉత్పన్నమైంది.

బాల్యానికి బంధనాలు

(మూడో పేజీ తరువాయి)

ఘోషాస్పత్రికి వచ్చే గర్భిణుల్లో 30 మంది వరకూ బాలికలు ఉంటున్నట్లు సమాచారం. ఏటా విద్యాసంవత్సరం ముగిసిన తరువాత వివాహాలు జరిపిస్తుంటారు. ఆ సమయంలో చడీ చప్పుడు లేకుండా ముహూర్తాలు ఖరారు చేస్తున్నారు. రహస్యంగా కూడా వివాహాలు జరిపిస్తున్న వారు ఉన్నారు. అయితే ఇటీవల కొంతమంది బాలికల్లో చైతన్యం వచ్చింది. చిన్ననాటే వివాహాలు చేసుకోవడానికి ఇష్టపడని వారు నేరుగా 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తున్నారు. ఈ విషయంలో చైల్డ్‌లైన్‌తో పాటు అన్ని శాఖలు అవగాహన పెంచితే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

రాజాం మున్సిపాలిటీలో రోవర్ మిస్సింగ్

(మూడో పేజీ తరువాయి)

రోవర్ కనిపించకుండా పోయింది. అయితే రోవర్ మిస్ అయిన విషయాన్ని బయటకు పొక్కనీయకుండా మున్సిపల్ యంత్రాంగం కినుక వహించింది.

తాజాగా వెలుగులోకి..

రాజాం పట్టణంలోని కొంత ప్రాంతం 22ఏలో ఉన్న విషయాన్ని ఇటీవల రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అసెంబ్లీలో ప్రస్తావించారు. దీనిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో 22ఏలో చేరిన భూముల్లో రీసర్వే చేయాల్సి ఉంది. అలాగే రంగప్ప చెరువులో ఆక్రమిత భూముల్ని తొలగించేందుకు సైతం రోవర్ అవసరం ఏర్పడింది. రోవర్‌కు సంబంధించిన స్టాండ్ మాత్రమే కార్యాలయంలోని ఓమూలన ఉండడంతో అధికారుల్లో వణుకు ప్రారంభమైంది. రోవర్‌తో పాటు ప్రభుత్వం సరఫరా చేసిన ఏడు ట్యాబ్‌లలో ఒక ట్యాబ్ గల్లంతయినట్లు విశ్వసనీయ సమాచారం. అప్పట్లో రీసర్వేలో పాల్గొన్న ఓ సచివాలయ ఉద్యోగి నుంచి ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్న కమిషనర్ సైతం బదిలీ కావడంతో ట్యాబ్ గల్లంతుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పొదుపు సంఘాల అక్రమాలపై విచారణ

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అలజంగి గ్రామంలో మహిళా పొదుపు సంఘాల అక్రమాలపై బొబ్బిలి ఏపీఎం పి.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం విచారణ చేపట్టారు. కేవలం మూడు గ్రూపులు మాత్రమే హాజరయ్యాయని, విచారణకు పెద్దగా సహకారం అందలేదని ఆమె తెలిపారు. బొబ్బిలి నుంచి 8 మంది వీవోఏలు, గజపతినగరం ఎల్‌సీ ఏపీఎం జి.దేవుడునాయుడు, రామభద్రపురం ఏపీఎం పి.సత్యనారాయణ, గరివిడి ఎల్‌సీ సీసీ పి.దుర్గాప్రసాదు, దత్తిరాజేరు ఎల్‌సీ సీసీ కె.భాస్కర్, ఎస్.కోట ఎస్ఎస్ మేనేజర్ కె.రమణ పాల్గొన్నారు.

14 నుంచి కెరీర్ గైడెన్స్ శిక్షణ

గరుగుబిల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయంలో మే 14 నుంచి 16వ తేదీ వరకు కెరీర్ గైడెన్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువత, విద్యార్థులకు శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో శిక్షణ అందిస్తామని చెప్పారు. పోటీ పరీక్షల్లో ఎలా విజయం సాధించాలి అనే అంశంతో పాటు బృంద కార్యక్రమాలు, అలాగే ధ్యానం, సెమినార్, లగాన్ మువీ చిత్ర ప్రదర్శన, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి జె.మురళి ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ నిర్వహిస్తామన్నారు. అర్హత కలిగిన వారికి ఉచిత వసతి, భోజనం ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు డి.నవజీవన్ 9177114333, డి.వాసుదేవరావు 8179012050 నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు ఆంగ్ల భాషోపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

బొబ్బిలి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల భాష ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న ఆంగ్ల భాషోపాధ్యాయులకు రాష్ట్ర స్థాయిలో వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు ఎం.విజయమోహనరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 14 బోధనాంశాలపై ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. రీసోర్స్ పర్సన్లుగా కె.సత్యనారాయణ, బి.పరమేశ్వర్, ఎస్.శ్రీనివాస్, రాంబాబు వ్యవహరిస్తున్నారని చెప్పారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి దామోదరరావు

బొబ్బిలి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వచ్చే నెల 10న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని పార్వతీపురం రెండో అదనపు జిల్లా న్యాయదాధికారి ఎస్.దామోదరరావు పిలుపునిచ్చారు. బొబ్బిలి కోర్టులో శుక్రవారం న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్‌అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, రాజీకి దగ్గ క్రిమినల్ కేసులను పరిష్కారం చేస్తామన్నారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ టీవీ రాజేశ్‌కుమార్ ఆదేశాల మేరకు కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోహిణిరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పి.మోహన్‌మురళీకుమార్, కార్యదర్శి కె.సింహాచలం, ఏజీపీ, ఏపీపీ, ఇతర సీనియర్‌న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయాధికారికి ఘనంగా వీడ్కోలు

బొబ్బిలి ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సీనియర్ సివిల్ న్యాయాధికారిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎస్.అరుణశ్రీకి శుక్రవారం స్థానిక కోర్టులో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా పలువురు సీనియర్ న్యాయవాదులు మోహన్ మురళీకుమార్, చందాన సూర్యనారాయణ, గంటి శర్మ, ఎం.సింహాచలం, కండాపు ప్రసాదరావు, మత్స బెనర్జీ తదితరులు ఆమె సేవలను కొనియాడారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మృతి

బొబ్బిలి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని సాయినగర్‌కు చెందిన రావుపల్లి సూర్యనారాయణ(85) అనే రిటైర్డ్ ఉపాధ్యాయుడు శుక్రవారం తన నివాసంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. బొబ్బిలి మండలం రాజుపేట గ్రామానికి చెందిన సూర్యనారాయణ 1992లో అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.



సూర్యనారాయణ (ఫైల్‌ఫోటో)

ఉగ్రవాదులపై చర్యలు తీసుకోండి

● పహల్గాం ఘటనపై ర్యాలీలు, మానవహారాలు

ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, పలు సంఘా నాయకులు కోరారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ఉగ్రవాదులు పర్యాటకులపై చేసిన దాడులకు నిరసిస్తూ శుక్రవారం విజయనగరం జిల్లాలో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



డెంకాడ: ర్యాలీ పాల్గొన్న నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి



బొబ్బిలి: మానవహారంగా ఏర్పడిన ముస్లింలు



నెల్లిమర్ల: నిరసన తెలుపుతున్న వామపక్ష సంఘాల నాయకులు



ఎస్.కోటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రాజాం రూరల్: రాజాం అంబేద్కర్ జంక్షన్ వద్ద మానవహారం



కొత్తవలస: గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నర్సిపురం ఆదర్శంగా నిలవాలి

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

● ఎస్సీ కార్పొరేషన్, పీఎం అజయ్ రుణాల పంపిణీ

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సిపురం గ్రామం అనేక ఆహార ధాన్యాలు, కూరగాయలు పండిస్తోందని, వీటిని రాష్ట్ర స్థాయిలో సరఫరా చేసి ఆదర్శంగా నిలవాలని, తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఇటీవల ఎస్సీ కార్పొరేషన్, పీఎం అజయ్ రుణాల మంజూరు కోసం దరఖాస్తు చేసిన ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆయన శుక్రవారం నర్సిపురం గ్రామంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో 23 మంది లబ్ధిదారులకు ఈ రుణాలు మంజూరయ్యాయని, అందులో పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు రుణాలు వచ్చాయని చెప్పారు. ఈ 8మందిలో ఆరుగురు నర్సిపురం గ్రామస్థులు కావడం అభినందనీయమన్నారు. నర్సిపురం రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా నిలవాలని, ఆ దిశగా మీరంతా కష్టపడి పంటలు పండించి ఎగుమతులు చేయాలని ఆయన సూచించారు. ఇతర జిల్లాల వలే నర్సిపురం అవకాయ పచ్చడి, నిమ్మకాయ, ఊరగాయ పచ్చళ్లు, నువ్వు అప్పడాలు, నెయ్యి అప్పడాలు ఇలా వివిధ రకాల పదార్థాలు తయారుచేసి ఎగుమతి చేస్తే దానికి సంబంధించి ప్రభుత్వం తరపున, తన తరపున ఆర్థిక సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకట్‌నాయుడు, గొట్టాపు వెంకటరమణ, బోను చంద్రమౌళి, అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

న్యూస్ బాక్స్

నేడు మంత్రి పర్యటన

మక్కువ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మక్కువలో శనివారం పర్యటించనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కల్యాణ మండపంలో మండలంలోని 21 పంచాయతీల కూటమి కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో అభివృద్ధి పనులపై చర్చిస్తారన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

వీరఘట్టం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.రాజేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు సమావేశ మందిరంలో కిశోర వికాసం వేసవి శిక్షణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ చదువు మధ్యలో ఆగిన బాలికలకు మళ్లీ పాఠశాలలకు వెళ్లి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. కిశోర బాలికల ఆరోగ్య సమస్యలపై వారికి అవగాహన కలిగేలా వివరించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఎస్.రాజేశ్వరి, జ్ఞానమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు తప్పవు

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఏ సమస్యకైనా వెంటనే పరిష్కారం చూపించాలని, లేదంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతో పాటు సంబంధిత అధికారులకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం గుడ్ మార్నింగ్ పార్వతీపురం కార్యక్రమంలో భాగంగా 13వ వార్డులోని ఇందిరాకాలనీలో ఆయన పర్యటించి, ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందని, తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, ఇళ్ల మధ్యే ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయని ఆ కాలనీ ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాలువల్లో యుద్ధప్రాతిపదికన పూడికలు తీయడమే కాకుండా నూతనంగా కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించామని చెప్పారు. రెండు రోజుల్లో ఇళ్ల మధ్య గల విద్యుత్ స్తంభాలను తొలగించి, నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖాధికారులకు సూచించానని తెలిపారు. ఈ వేసవి కాలంలో కనీసం రెండు రోజులకొకసారి నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కమిషనర్ వెంకటేశ్వర్లు, అధికారులతో పాటు మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బీజయబాబు, టీడీపీ పట్టణ, యువజన విభాగాల అధ్యక్షులు జి.రవికుమార్, పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

సీతానగరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారిణి రాజేశ్వరి, ఎంపీడీవో త్రివిక్రమరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వారు ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలోని గెడ్డలుప్పి గ్రామంలో గృహ నిర్మాణ పనులు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పనులు జరిపిన వారికి బిల్లులు అందుతాయన్నారు. అలాగే ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై సర్వే

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గల పార్వతీపురం కొత్తవలస జగనన్న లేఅవుట్లో నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న నిర్మాణాలపై పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే నిర్వహించారు. ఇటీవల కలెక్టర్‌కు కొత్తవలస జీ లేఅవుట్‌లో 16 సెంట్లలో ఆక్రమితంగా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మితమైన నిర్మాణాలపై ఫిర్యాదులు వెల్లడంతో సంబంధిత అధికారులు దర్యాప్తు నిర్వహించారు. సంబంధిత పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ విభాగం అధికారులను వివరణ కోరగా త్వరలోనే నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

జిల్లా న్యాయాధికారిని కలిసిన ఎస్పీ

బెలగాం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా నూతన న్యాయాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.బబితను ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో ఆమెకు పూలమొక్కను అందజేసి, ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఇరు శాఖల సమన్వయంతో బాధితులకు న్యాయం చేసేలా పని చేద్దామన్నారు.



న్యాయాధికారి బబితకు పూలమొక్కను అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు

గరుగుబిల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకాం, తోటపల్లి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారని ఎంపీడీవో జి.పైడితల్లి శుక్రవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. చిలకాం గ్రామంలో ఈనెల 21న పీడీ పరిశీలించిన సమయంలో వేతనదారులు పనులకు హాజరైనట్లు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ బలగ మల్లేశ్వరరావు డిమస్తరు పంపించారు. అయితే పని ప్రాంతంలో 12 మంది పనిచేస్తున్నట్లు సమాచారం అందించినప్పటికీ ఫొటోలో వేతనదారులు లేని పరిస్థితిని పీడీ గమనించారు. తప్పుడు సమాచారం అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తోటపల్లికి సంబంధించి పని ప్రాంతంలో 61 మంది ఉన్నట్లు డిమస్తరు పంపించగా, 31 మందే పనులకు హాజరైనట్లు గుర్తించారు. ఈ మేరకు ఈనెల 23న వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తప్పుడు మస్టర్లపై పూర్తిస్థాయి సమాచారం అందించాలని గరుగుబిల్లి ఎంపీడీవో జి.పైడితల్లికి, ఏపీవో ఎం.గౌరీనాథ్‌లకు ఆయన శుక్రవారం ఆదేశించారు. తగిన వివరణ అందించని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భీముడు కుటుంబానికి న్యాయం చేయాలి

భామిని, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాలాడలో మృతి చెందిన గొర్లె భీముడు కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గిరిజన ఐక్యవేదిక సంఘ అధ్యక్షుడు శాంతారావు డిమాండ్ చేశారు. శుక్రవారం తాలాడ గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. భీముడును హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీనిపై నిర్లక్ష్యం చేస్తే మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో తమ ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి కుటుంబ పోషణకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జి.ప్రసాద్, కృష్ణవేణి, రాజు, భీముడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



తాలాడలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఘనంగా పాలజంగిడి ఊరేగింపు



అమ్మవారి పాలజంగిడిని ఊరేగిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రజల ఇలవేల్పు ఇప్పల పోలమ్మ ఘటాలు, పాలజంగిడి ఊరేగింపు శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి పాలజంగిడి, ఘటాలను ఊరేగించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

పార్వతీపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ పేదలకు దుప్పట్లు, దోమతెరలను వితరణ చేసింది. వీటిని గుమ్మ లక్ష్మీపురంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు, సభ్యులు, కురుపాం మార్కెట్ కమిటీ చైర్మన్ కడ్రక కళావతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఇన్‌చార్జి డీఈవో



కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో ఇన్‌చార్జి డీఈవో రమాజ్యోతి, అధికారులు

పార్వతీపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం లో నిలిచిన నేపథ్యంలో ఇన్‌చార్జి డీఈవో రమాజ్యోతి శుక్రవారం కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఆమె వెంట విద్యా శాఖాధికారులు ఉన్నారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపా రు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. పాఠశాలల పునః ప్రారంభం నుంచి ప్రణాళిక ప్రకారం విద్యాబోధన చేపట్టాలన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులకు, విద్యా శాఖాధికారులకు, పాఠశాలల ప్రత్యేక అధికారులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా జేసీ శోభికను విద్యా శాఖాధికారులు కలిసి ఫలితాలపై వివరించారు.